క్లుప్తంగా

మిస్టరీగా మారుతున్న అశోక్‌కుమార్ హత్య కేసు

సాక్షి టాస్క్‌ఫోర్స్: పాకాల మండలం, దామల చెరువుకు చెందిన అశోక్‌కుమార్ హత్య కేసు మిస్టరీగా మారింది. గత గురువారం గుర్తు తెలియని దుండగులు అశోక్‌కుమార్‌ను అతికిరాతకంగా కత్తులతో దాడి చేసి హతమార్చిన విషయం తెల్సిందే. ఈ కేసుకు సంబంధించి స్థానికుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అశోక్‌కుమార్ మెడికల్ షాపు నిర్వహణతో పాటు, మామిడి కాయల వ్యాపారం, వడ్డీ వ్యాపారం చేసేవాడు. హత్యకు ప్రధాన కారణం ఆర్థిక లావాదేవీలే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. ఆర్థిక లావాదేవీలతో పాటు, వడ్డీ వ్యాపారంలో ఇళ్లు, ఇంటి స్థలాలను తనకా పెట్టుకుని డబ్బులు ఇచ్చేవాడని తెలుస్తోంది. భారీ స్థాయిలో నగదు లావాదేవీలు, వ్యాపారాలు చేసినట్లుగా సమాచారం. హత్య జరిగిన తీరును పరిశీలిస్తే హతమార్చిన దుండగులకు, హత్యకు గురైన అశోక్‌కుమార్‌కు ఆర్థిక లావాదేవీలు ఉంటాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి మృతి

రాయచోటి: రాయచోటి రూరల్ మండలం జంగంరెడ్డిగారిపల్లె సమీపంలో చింత చెట్టుకు ఉరివేసుకుని కోటకొండ రెడ్డప్ప(40) మృతి చెందినట్లు రాయచోటి అర్బన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి టౌన్ ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న రెడ్డప్ప జంగమరెడ్డిగారిపల్లెలోని కుమార్తె డేరంగుల మాధవి ఇంటికి ఐదు రోజుల కిందట వచ్చారు. మద్యం తాగడం మానుకోవాలంటూ కుమార్తె మాధవి చెప్పింది. మద్యానికి బానిసైన రెడ్డప్ప మద్యం తాగకుండా ఉండలేక గురువారం రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఇంటి నుంచి వెళ్లి మామిడితోటలోని చింత చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందారు. రెడ్డప్ప కుమార్తె డేరంగుల మాధవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుష్పయాగానికి అంకురార్పణ

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో శనివారం నిర్వహించనున్న పుష్పయాగానికి శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ బి.రవి, సూపరింటెండెంట్ ఎం.మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ఏఎం సురేష్‌బాబు, గుణశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన భాష్యకార్ల ఉత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో గత పది రోజుల పాటు చేపట్టిన భాష్యకార్ల ఉత్సవాలు శుక్రవారం శాత్తుమొరతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు స్వామి వారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం తిరుమంజనం, ఆస్థానం, శాత్తుమొర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి పాల్గొన్నారు.

పల్లె వైద్యంపై 'సమ్మె'ట!

- సీహెచ్‌ఓల సమ్మెతో స్తంభించిన వైద్యసేవలు
- అవస్థలు పడుతున్న పేదలు

తిరుపతి తుడా: పేదల వైద్యం పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. సకాలంలో వైద్యసేవలందకుండా ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తోంది. వైద్య సిబ్బంది న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే 108 ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యం ఆందోళన బాట పట్టగా.. తాజాగా శుక్రవారం నుంచి విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేసే ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చింది. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరవధిక సమ్మెతో పల్లె వైద్యం స్తంభించిపోయింది.

విచ్ఛిన్నం చేయాలనే కుట్ర

గత ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 14 రకాల వైద్య సేవలతోపాటు 105 రకాల మందులు అందుబాటులో తెచ్చింది. స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందించాలన్న సంకల్పంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు పురుడుపోసింది. ఈ క్లినిక్‌లలో పటిష్టమైన వైద్య పరికరాలను సమకూర్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పేదలకు అందిస్తున్న వైద్య వ్యవస్థలను సర్వనాశనం చేసింది.

జిల్లా సమాచారం		
పీహెచ్‌సీలు	విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	సీహెచ్‌ఓలు
58	439	425



డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెకు దిగిన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

డిమాండ్లు పరిష్కరించాల్సిందే



మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలి. సీహెచ్‌ఓల జీతభత్యాలు ఇవ్వడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన ఎంఎల్ హెచ్‌పీలను రెగ్యులర్ చేయాలి. జీఓ నంబర్ 64 ప్రకారం ఎన్ హెచ్‌ఎంలో అన్ని కేడర్ల ఉద్యోగులకు 23 శాతం పీఆర్సీ ఇవ్వాలి. 189 కేడర్లకు ఇచ్చి సీహెచ్‌ఓలకు ఇవ్వకపోవడం అన్యాయం.

– కవిత కుమారి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, తిరుపతి జిల్లా

డిమాండ్లు ఇవీ

- ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలి
- పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలి
- ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలి
- క్లినిక్‌ల అద్దె బకాయిలను చెల్లించాలి
- నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలి
- ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి సీహెచ్‌ఓలను మినహాయించాలి
- హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్లు, బదిలీలు, పితృత్వ సెలవులు అమలు చేయాలి.

గత నెల 28 నుంచి సమ్మె



జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలనే ప్రధానమైన డిమాండ్లతో సమ్మె కుదిగాం. తొలుత శాంతియుతంగానే నిరసన చేపట్టాం. ఫలితం లేకపోవడంతో నిరవధిక సమ్మె చేపట్టాం. గత నెల 28వ తేదీ నుంచి సమ్మె కొనసాగుతోంది.

-పీ.పొన్న్యాన, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, తిరుపతి జిల్లా

ఇంత నిర్లక్ష్యమా



మారుమూల గ్రామ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న మా పట్ల ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యమేల?. ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి. ప్రతి నెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలి. ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి.

-సాయి మోహన్, సీహెచ్‌ఓ, తిరుపతి జిల్లా

కూటమి అరాచకాలను ఎండగడుతూనే ఉందాం



పార్టీ అనుబంధ విభాగాల నాయకులతో సమావేశమైన భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి

- చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : కూటమి అరాచకపాలనను ప్రజల పక్షాన నిలబడి ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉందామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులతో సమావేశం నిర్వహించారు. భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలను పూర్తిస్థాయిలో బలపరచాలని కోరారు. అందుకోసం పార్టీ అనుబంధ విభాగాల నాయకులు వారి వారి విభాగాలకు సంబంధించి కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కిందస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను, అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందించిన ఘనత జగనన్నదేనన్నారు. ఎన్నికల్లో జగనన్నపై ఎల్లో మీడియా ద్వారా లేనిపోని విషప్రచారాలు, అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న విషయాన్ని ఇప్పటికే ప్రజలంతా గ్రహించారన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని చెప్పారు. అనంతరం ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేసుకుని కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలన్నారు. కుల మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించిన గొప్ప నాయకుడు జగనన్న అని కొనియాడారు. కూటమి పాలనలో ఏ ఒక్క సంక్షేమం అందక పేద ప్రజలు విలవిల్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి తప్పు చేశామని ప్రజలంతా ఇప్పటికే ఆవేదన చెందుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో ప్రజలే పెకలించివేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆరోపణలు తొక్కిపెట్టి... విధేయతకు పట్టం కట్టి

- బర్డ్ డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్
- మరోసారి అవకాశం ఇచ్చిన ప్రభుత్వం
- సీనియర్లకు మొండి చెయ్యి



సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్న డాక్టర్ జగదీష్

తిరుపతి తుడా: టీటీడీ బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్‌ని మరోమారు నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. బర్డ్ డైరెక్టర్‌గా ఆయన గతంలో సుదీర్ఘకాలం పని చేశారు. తీవ్రమైన అవినీతి ఆరోపణలతో ఆస్పత్రి నుంచి ఆయన గతంలో బయటకు వచ్చారు. ప్రభుత్వం ఆయన పట్ల విధేయతను చూపుతూ మరోసారి అందలమెక్కించింది. ఆస్పత్రి వర్గాలు సైతం ఆయన నియామకం పట్ల ఆందోళన చెందుతున్నాయి.

ఆయన చెప్పిందే రూల్

బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్ చెప్పిందే రూల్. ఆయన చేసిందే శాసనం. ఆస్పత్రికి అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వైద్య పరికరాల కొనుగోలు, ప్లాంటేషన్, మందులు వంటి కొనుగోళ్లన్నీ ఆయన కనుసన్నల్లోనే సాగాయనే ఆరోపణలున్నాయి. టీటీడీ బర్డ్ ఆస్పత్రిని తన సొంత జాగీర్‌లా మార్చేశారనే విమర్శలు ఉన్నాయి. కీళ్ల మార్పిడి విషయంలో కనీస నిబంధనలు పాటించకుండా వ్యవరించారని గతంలో టీటీడీ అధికారులే తేటతెల్లం చేశారు. స్వయంగా ఆయన సర్జరీ చేయాలంటే కోటీశ్వరులైనా ఉండాలని.. లేదా తన సామాజిక వర్గం వారైనా ఉంటేనే వైద్యం చేసేవారని బోర్డు వర్గాలే బహిరంగంగా విమర్శలు గుప్పించాయి. తన రాజరిక పాలనతో బోర్డును అస్తవ్యస్తం చేశారని భావించిన టీటీడీ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్లాంటేషన్‌లోనూ నిబంధనలు తీసుకొచ్చింది.

వారికే ఎక్కువ అవకాశం

బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ పనిచేసిన కాలంలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారికి ఎక్కువ అవకాశాలు కల్పించారనే విమర్శలున్నాయి. నర్సులు, టెక్నీషియన్లు, సెక్యూరిటీ గార్డ్, ఇతర సిబ్బందిలో 80 శాతానికి పైగా తన సామాజికవర్గం వారికి ఆయన అవకాశాలు కల్పించినట్లు సమాచారం.

సీనియర్లకు మొండి చెయ్యి

బర్డ్ డైరెక్టర్‌గా టీటీడీ ఆస్పత్రుల్లో పనిచేసే సీనియర్లకే అవకాశం కల్పించాలని ఇటీవల వైద్యులు ఉన్నతాధికారుల కు విజ్ఞప్తి చేశారు. బర్డ్ ఆస్పత్రిలో ముగ్గురు సీనియర్ వైద్యులు ఉన్నారు. వీరిలో ఒకరికి అవకాశం కల్పించకుండా ప్రభుత్వం డాక్టర్ జగదీష్‌కే అవకాశం ఇవ్వడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎర్రచందనం చోరీ కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి, ఎర్రచందనం చెట్లను నరికిన కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ అధికారి చంద్రశేఖర్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. సిద్ధవటం రేంజ్, ముత్తుకూరు బీట్, కోమటివాని బావి ప్రాంతంలో 2019 అక్టోబర్ ఒకటో తేదీ ఫారెస్ట్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా వైఎస్సార్ కడప జిల్లా, సిద్ధవటం మండలం, మాధవరానికి చెందిన ఆర్.సుబ్బరాజు, వైఎస్సార్ కడప జిల్లా, అల్లూరు మండలం, ఎస్ వెంకటాపురానికి చెందిన జీ.ఎల్లయ్య ఎర్రచందనం చెట్లను నరుకుతూ పట్టుపడ్డారు. ఇద్దరి వద్ద 47 కిలోల రెండు ఎర్రచందనం దుంగలను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం ఇద్దరిపై రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

జామీను ఇచ్చినందుకు జరిమానా

తిరుపతి లీగల్: ఎర్రచందనం కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురికి జామీను ఇచ్చారు. వారు కోర్టుకు హాజరు కాలేదు. కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అయినా కోర్టుకు రాలేదు. దీంతో వారికి జామీను ఇచ్చిన ఇద్దరు ఒక్కొక్కరు లక్ష రూపాయలు చొప్పున జరిమానా చెల్లించాలని తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... 2017 ఆగస్టు 23వ తేదీ తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ఆరుగురు నిందితులు 11 ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తూ ఐరాల పోలీసులకు పట్టుపడ్డారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆరుగురికి బెయిల్ మంజూరు చేసింది. దానికి గాను ఆరుగురు నిందితులు ఒక్కొక్కరు 20,000 రూపాయలతోపాటు జామీనుపై విడుదల చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు, దొడ్డిపల్లికి చెందిన జి ప్రసాద్, నాయన వారి పల్లి చెందిన జి శేషాద్రి నాయుడు ఆరుగురికి జామీను ఇచ్చారు. తర్వాత కేసు విచారణ దశలో ఓ నిందితుడు మృతి చెందాడు. మిగిలిన ఐదుగురు కేసు విచారణకు హాజరు కాలేదు. దీంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్‌పై ఐదుగురిని కోర్టులో హాజరు పరిచాలని పోలీసులను ఆదేశించింది. పోలీసులు వారిని హాజరుపరచలేకపోయారు. దీంతో వారికి జామీను ఇచ్చిన ఇద్దరిని కోర్టులో హాజరుపరచాలని న్యాయమూర్తి పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసులు ఇద్దరు జామీనుదారులను శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. తెలియని వ్యక్తులకు జామీను ఇచ్చి వారిని కోర్టులో హాజరు పరచలేక పోయినందుకు ఒక్కో జామీను దారుడు లక్ష రూపాయలు చొప్పున జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మల్లయ్యపల్లిలో అపచారం



ఆలయంలో కాలి బూడిదైన దేవతామూర్తుల చిత్రపటాలు

చంద్రగిరి: మండల పరిధిలోని మల్లయ్యపల్లిలో అపచారం చోటుచేసుకుంది. దుండగులు ఆలయంలోకి నిప్పును విసిరేయడంతో దేవుళ్ల చిత్రపటాలు దగ్ధమైన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు, మల్లయ్యపల్లి దళితవాడలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గర్భగుడిలోకి నిప్పును విసిరేశారు. దీంతో శ్రీవేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, వినాయక స్వామి చిత్రపటాలు దగ్ధమయ్యాయి. ఆలయంలో నుంచి మంటలను గుర్తించిన స్థానికులు మంటలను ఆర్పారు. తొలుత షార్ట్ సర్క్యూట్ అయ్యి ఉండవచ్చని భావించారు. అయితే ప్రమాద స్థలంలో విద్యుత్ వైర్లు లేకపోవడంతో ఎవరో ఉద్దేశపూర్వకంగా ఈ ఘాతుకానికి పాల్పడినట్లుగా గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి సంబంధించి రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు ఆరోపణలు గుప్పించుకున్నారు. అనంతరం గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మలుపులు తిరుగుతున్న బదిలీలు



బదిలీ ఉత్తర్వులను స్వీకరిస్తున్న నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఇష్టానుసారంగా జరుగుతున్న బదిలీల వ్యవహారం మలుపులు తిరుగుతోంది. వర్సిటీలో ఇప్పటికే సుమారు 300 మంది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు అధికారుల బదిలీ వేటుకు బలయ్యారు. నాలుగురోజుల క్రితం కొత్తగా 32 మందిని బదిలీ చేశారు. ఆగ్రహించిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు అధికారులను బదిలీలపై నిలదీయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందులో భాగంగా బీ10 సూపరింటెండెంట్‌గా ఉన్న నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్ సుబ్రమణ్యంను సైతం ఆర్‌టీఐ అండ్ లీగల్ సెల్‌కు బదిలీ చేశారు. అనంతరం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు శుక్రవారం మరో మారు ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై బదిలీలపై చర్చించారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్–1 సర్వీస్ మెయిన్స్ రాత పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై డీఆర్వో అధికారులతో సమీక్షించారు. శనివారం నుంచి 9 తేదీ వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పరీక్షలకు 911 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల్లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. నగరంలోని న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ జూనియర్ కళాశాల, కేటీ రోడ్డులోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, ఎస్వీయూనివర్సిటీ పరిధిలోని ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌ల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

కాలకేయ కూటమిని తరిమికొడదాం

- రెడ్‌బుక్ పాలనలో సమిధలవుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- శ్రీకాళహస్తి మండలం, ఇనగలూరు సర్పంచ్‌కు చెందిన టేకు కొయ్యలు తగులబెట్టిన వైనం
- దుర్మార్గచర్యపై లోతైన విచారణ జరపాలి : ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి

రేణిగుంట: కాలకేయ కూటమిని తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మండలం, ఇనగలూరు సర్పంచ్ చెలికం నాగరాజురెడ్డికి చెందిన రూ.10 లక్షల విలువైన 100 టన్నుల టేకు కొయ్యలను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. పక్కనే ఉన్న ఓ కల్లు దుకాణానికి నిప్పు పెట్టారు. అయితే టీడీపీ శ్రేణులే తనను ఆర్థికంగా దెబ్బతీసేందుకు ఇంతటి దారుణానికి తెగబడ్డారని బాధితుడు ఆక్రందన చెందారు. విషయం తెలుసుకున్న తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సర్పంచ్ గాన రాజురెడ్డికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు వారి నుంచి బాధితునికి నష్టపరిహారం కట్టివ్వాలని డిమాండ్ చేశారు.

బెదిరింపులకు భయపడం

కూటమికి ఓటు వేయలేదనే కారణంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆస్తుల విధ్వంసానికి కూటమి కుయుక్తులు పన్నుతోందని ఎంపీ దుయ్యబట్టా రు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు తిరగబడి కూటమి నాయకులను తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

ఇనగలూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. పని చేసిన దినాల కంటే తక్కువ దినాలు నమోదు చేస్తున్నారని, అసలు పనిచేయని కొందరిని, కూలీలుగా చేర్చి పనిచేసిన వారి డబ్బులు వారి ఖాతాలకు మళ్లిస్తున్నారని వివరించారు. దీనిపై స్పందించిన ఎంపీ గురుమూర్తి ఫోన్లో జిల్లా డ్వామా పీడీతో మాట్లాడారు. ఈ ఘటనపై విచారణ చేయాలని ఆదేశించారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు కూనాటి రమణయ్యయాదవ్, వయ్యాల మనోహర్ రెడ్డి, చెంచయ్య నాయుడు, సర్పంచులు చెలికం నాగరాజెరెడ్డి, వెంపల్ల సురేంద్రయాదవ్, దిలీప్‌కుమార్, రఘునాయుడు, నరేష్‌రెడ్డి, జగ్గరాజుపల్లి శివ, రేపల్లి మల్లి, ఊరందూరు నవీన్ పాల్గొన్నారు.



ఇనగలూరులో దహనమైన దుంగలను పరిశీలిస్తున్న ఎంపీ గురుమూర్తి



దుండగుల దురాగతానికి కాలిపోయిన కల్లు దుకాణం

కక్షగట్టి తగులబెట్టారు

ఇది ముమ్మాటికీ కూటమి నాయకులు కక్ష కట్టి తగలబెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు. ఇంతకుముందు ఈ ప్రదేశంలోనే నా బోరు మోటారును ఎత్తుకెళ్లారు. ఓ గుడిసెను తగులబెట్టారు. మళ్లీ ఇప్పుడు పక్కాగా ప్లాన్ చేసి రూ.10లక్షల విలువైన టేకు కొయ్యలను తగలబెట్టారు. ఈ తరహా రాజకీయాలు ఎన్నడూ చూడలేదు. పోలీసులు లోతుగా విచారిస్తే నిందితులు బయటకు వస్తారు.

– చెలికం నాగరాజురెడ్డి, బాధితుడు, సర్పంచ్, ఇనగలూరు, శ్రీకాళహస్తి మండలం

క్షుద్ర రాజకీయాలు మానుకోవాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సంక్షేమం అందించాల్సింది పోయి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకుని భౌతిక దాడులకు తెగబడుతూ, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు పెను ముప్పు.

– ఓడూరు గిరిధర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు

తిరగబడే రోజులు దగ్గర్లోనే

కూటమి నాయకుల అరాచకాలకు అంతే లేకుండా పోతోంది. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మరింత ఎక్కువగా ఉంది. అధికారులు కూడా నిబంధనలు మరిచి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. వ్యవస్థలపై విశ్వాసాన్ని సన్నగిల్లేలా వ్యవహరిస్తున్నారు. అరాచకాలపై సామాన్య ప్రజలే తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

– కూనాటి రమణయ్యయాదవ్, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు

క్లుప్తంగా

గంగమ్మా.. చల్లగా చూడమ్మా!



అమ్మవారి సేవలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్ : మండలంలోని తుమ్మలగుంట గ్రామంలో శుక్రవారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. చల్లగా చూడమ్మా.. అంటూ ప్రార్థించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులతో పాటు తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆలయానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

స్కౌట్ అండ్ గైడ్స్ అభివృద్ధికి వినతి



ప్రిన్సిపల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీకాంత్

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అభివృద్ధికి సహకరించాలని హిందూస్థాన్ స్కౌట్ అండ్ గైడ్స్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ తుంగ శ్రీకాంత్ కోరా రు. కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ డాక్టర్ జె.రాధను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. పుల్లూరు దయాకర్, గుణిశెట్టి వెంకట సుమంత్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాల అమలుకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : కార్మిక చట్టాల అమలుకు ప్రభుత్వాలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆటోనగర్‌లో గుజరి వ్యాపారుల సంఘ నేతలతో కలిసి ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. సీపీఐ నేత చిన్నం పెంచలయ్య, ఏఐటీయూసీ నేతలు రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌డీ రవి, అల్లాబక్షు, రమణ, శ్రీరాములు, బాల, అజీమ్ బాషా, నాగరాజు పాల్గొన్నారు.

సన్మార్గమే త్రైత సిద్ధాంతం

పాకాల : మానవుడిని సన్మార్గంలో నడిపించడమే త్రైత సిద్ధాంతమని ప్రబోధ సేవాసమితి సభ్యులు తెలిపారు. శుక్రవారం మండలంలోని బండపాకాల, చెన్నుగారిపల్లి, మణిపిరెడ్డిపల్లె, సూరినేనివారిపల్లె, కొత్తపల్లె, పెద్దగోర్పాడు, పెద్దరామాపురం, గానుగపెంటలో భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. సమితి సభ్యులు కె.అశోక్‌బాబు, బాలాజీ, బండ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణప్ప సేవలు మరువలేం



నారాయణప్ప దంపతులను సత్కరిస్తున్న వైద్యసిబ్బంది

తిరుపతి తుడా : బీమా వైద్య శాఖలో 38 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేసిన ఎం.నారాయణప్ప సేవలు మరువలేమని తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు కొనియాడారు. శుక్రవారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా ఆర్‌సీ రోడ్‌లోని ఈఎస్ఐలో ఘనంగా సత్కరించారు.

ఘనంగా పుస్తకావిష్కరణ

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలోని చెలికాని అన్నారావు సమావేశ మందిరంలో శుక్రవారం వివాహ దివ్యత్వ సాధనం పుస్తకావిష్కరణ నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ స్పెషల్ ఆఫీసర్ శ్రీరామ్ రఘునాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, మేడసాని మోహన్, దక్షిణామూర్తి, పీవీ రెడ్డి, ఆముదాల మురళి, శ్రీదేవి పాల్గొన్నారు

'కగార్' నిలుపుదలకు డిమాండ్



నిరసన తెలుపుతున్న నేతలు

తిరుపతి కల్చరల్ : తెలంగాణ, చత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్‌ను తక్షణం నిలుపుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.వెంకటరత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. నేతలు ఆర్.వెంకయ్య, లోకేష్, ఎం.ఆరుణ, వెంకటేష్, లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన అవతారోత్సవాలు

తిరుపతి కల్చరల్ : అన్నమాచార్య కళామందిరంలో ఈనెల 30 నుంచి నిర్వహిస్తున్న శ్రీరామానుజాచార్యుల అవతార మహోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈసందర్భంగా చేపట్టిన సాహితీ సదస్సులో కేఈ లక్ష్మీనరసింహన్ ప్రధాన వక్తగా ' రామానుజాచార్యులు-తిరుమల కైంకర్యాలు' అనే అంశంపై ఉపన్యసించారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పురుషోత్తం, ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోకిల తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ

తిరుపతి రూరల్ మండలం పాడిపేటలో సర్వే నంబర్ 233/3లోనిన్న నక్కల వాగు కబ్జా కోరల్లో చిక్కుకుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో కుంచించుకుపోతోంది. రామచంద్రాపురం మండలం రాయలచెరువు నుంచి వరదనీరు ఈ నక్కల వాగు నుంచే రేణిగుంట వద్ద స్వర్ణముఖి నదిలో కలుస్తుంది. ఈ కాలువ సక్రమంగా లేకపోతే భారీ వర్షాలు కురిస్తే వందలాది గ్రామాలు నీటి మునిగే ప్రమాదముంది. ఇంతటి ప్రాధాన్యత గల నక్కల వాగును యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. అక్రమంగా భారీ భవనాలు నిర్మించేస్తున్నారు. ఈ ప్రాంతంలో టీడీపీకి చెందిన ఓ నేత ముందుగా ఇల్లు కట్టుకున్నారు. ఇదే అదునుగా మరింత మంది ఇష్టారాజ్యంగా వాగును పూడ్చుకుంటూ నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై సర్పంచ్ పలుమార్లు హెచ్చరించినా అక్రమార్కులు పెడచెవిన పెడుతున్నారు. ఉన్నతాధికారులైతే చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

– సాక్షి,టాస్క్‌ఫోర్స్



అక్రమం



చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం పీవీపురంలో మట్టి మాఫియా బరితెగించింది. గుండాల చెరువును చెరబట్టి.. మట్టిని కొల్లగొడుతోంది. పట్టపగలే యంత్రాలతో యథేచ్ఛగా తవ్వేస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా రెచ్చిపోతోంది. గ్రామస్తులు అడ్డుకునేందుకు యత్నిస్తే బెదిరింపులకు దిగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధి అండతో పేట్రేగిపోతోంది. తెలుగు తమ్ముళ్ల అక్రమార్జనకు వందలాది ఎకరాలకు సాగునీరు అందించిన గుండాల చెరువు ఆనవాలు లేకుండా పోతోంది. దీనిపై మైనింగ్‌శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తినా స్పందన మాత్రం కరువైంది. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి మట్టి తవ్వకాలకు చెక్ పెట్టాలని స్థానిక ప్రజానీకం కోరుతోంది.

– సాక్షి, టాస్క్‌ఫోర్స్

అధ్వాన్నం



స్వచ్ఛ తిరుపతిగా పలుమార్లు ర్యాంకులు కైవసం చేసుకుని తిరునగరంలో ప్రస్తుతం చెత్తకుప్పల దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా పెద్ద కాపు వీధి, కొర్లగుంట, చింతల చేను, కొర్లగుంట మాస్టర్ ప్లాన్ రోడ్లకు ఇరువైపులా, చంద్రశేఖర్ రెడ్డి కాలనీ, తిమ్మినాయుడుపాళెం, ఖాదీ కాలనీ, కోట కొమ్మల వీధి తదితర ప్రాంతాలు చెత్తాచెదారాలతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. కార్పొరేషన్ సిబ్బంది రెండు మూడు రోజులకు ఒకసారి మాత్రమే పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. – తిరుపతి తుడా



నగరం.. నెట్ వలయం!

ఆధ్యాత్మిక నగరంలో ఇంటర్‌నెట్‌ను అత్యధికంగా వినియోగిస్తున్నారు. ప్రతి పది ఇళ్లకుగాను ఐదింట ఫైబర్, వైర్‌లెస్ కనెక్షన్లు వాడుతున్నారు. కంప్యూటర్లతోపాటు టీవీలను సైతం నెట్‌వర్క్‌కు అనుసంధానం చేసుకుంటున్నారు. కంపెనీలు ప్రకటిస్తున్న ఆఫర్లను సద్వినియోగం చేసుకుంటూ సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే అందుబాటులోకి వచ్చిన వేగవంతమైన ఎంబీపీఎస్ వైపుగా మొగ్గుతున్నారు. ప్రధానంగా కోవిడ్ తర్వాత నెట్ కనెక్టివిటీపై కస్టమర్లు ఆసక్తిచూపుతున్నారు.



తిరుపతి వ్యూ

- తిరుపతిలో 85వేలకు పైగా నెట్ వైర్‌లెస్ కనెక్షన్లు
- ప్రతి నెలా రూ.6కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు
- సేవలందిస్తున్న సుమారు 26 ప్రైవేట్, ప్రభుత్వ కంపెనీలు
- వేసవిలో రెండింతలు పెరిగిన వినియోగదారులు

తిరుపతి తుడా: తిరునగరంలో సుమారు 26 ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలకు చెందిన వైర్‌లెస్ నెట్ కంపెనీలు సేవలు అందిస్తున్నాయి. ఈ అవకాశఋూలను నగరవాసులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. దీంతో కేబుల్ నెట్ కనెక్షన్లు 12శాతానికి పడిపోయాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. టీవీలు, కంప్యూటర్లను నెట్‌వర్క్‌కు అనుసంధానం చేసుకునేలా కంపెనీలు ఆఫర్ల మీద ఆఫర్లు ప్రకటించడంతో కస్టమర్లు వైర్‌లెస్ కనెక్టివిటీపై మోజు పెంచుకుంటున్నారు. ఎంబీపీఎస్ వేగాన్ని సైతం ఆయా కంపెనీలు పెంచుతుండడంతో విపరీతంగా ఆసక్తి చూపుతున్నారు.

కోవిడ్ తర్వాత వేగంగా విస్తరణ

కోవిడ్ సమయంల తర్వాత నగరంలో నెట్ కల్చర్ ఊపందుకుంది. ఒక ఇంట్లో సభ్యులు టీవీ, కంప్యూటర్, సెల్‌ఫోన్‌కు అన్నింటికీ ఇంటర్నెట్ కనెక్షన్ వినియోగిస్తున్నారు. దీంతో పరిశోధనలు, ఈ-మెయిల్, వీడియోకాల్స్, సోషల్ మీడియాతో వాడకానికి, ఆన్‌లైన్ షాపింగ్, బ్యాంకింగ్, చెల్లింపులు, విద్యా పరంగా ఆన్‌లైన్ కోర్సులు, విద్యా, ఉపాధి అవకాశాల సమాచార సేకరణకు విరివిగా ఉపయోగిస్తున్నారు. అలాగే ఆన్‌లైన్ గేమ్స్, సంగీతం, లైవ్‌షోలు, నెట్‌ఫ్లిక్స్, ఆమెజాన్ ప్రైమ్ వంటి ప్లాట్‌ఫామ్‌లతో ఇంటి నుంచి వేలాది సినిమాలు, టీవీషోలను వీక్షిస్తున్నారు.

రూ.కోట్ల వ్యాపారం

నగరంలో సుమారు 1.20లక్షల గృహాలు ఉన్నాయి. ఇందులో సుమారు 85వేలకు పైగా కుటుంబాలు ఇంటర్నేట్ సేవలు వినియోగిస్తుండడం గమనార్హం. ప్రతి నెల సరాసరిన రూ. 475 చొప్పున సుమారు రూ. 6 కోట్లకు పైగా నెట్‌సేవల కోసం ప్రజలు ఖర్చు చేస్తున్నారు.

పలు కంపెనీలు హల్‌చల్

తిరుపతి నగరంలో జియో, ఎయిర్‌టెల్, ఎక్స్‌ట్రీమ్, ఏసీటీ, బీఎస్ఎన్ఎల్, సిటీ ఆన్‌లైన్, డీనెట్, టాటాప్లే, మైత్రీ, బెస్ట్ ఇంటర్నెట్, బాలాజీ, ఆన్‌లైన్ బ్రాడ్ బ్యాండ్, హాత్‌వే, ఎక్సీటెల్ వంటి సంస్థలు నెట్‌సేవలను అందించడంలో ముందున్నాయి. ప్రత్యేక ఆఫర్లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయి. ఇందులో ఒక్కో సంస్థ వారందించే ఇంటర్నేట్ వేగం మేరకు నెలవారీ చార్జీలు వసూలు చేస్తున్నాయి. 40ఎంబీపీఎస్ వేగానికి రూ.650, వంద ఎంబీపీఎస్ వేగంతో అందించే ప్లాన్‌కు రూ. 899లు, 150 నుంచి 200 వేగానికి రూ.999లు, 300ఎంబీపీఎస్ వేగానికి రూ.1499లు నెలవారీ చార్జ్ చేస్తున్నాయి. అలాగే కస్టమర్లకు పలు రాయితీలు అందిస్తున్నాయి.

ప్రపంచమంతా ఇంట్లోనే..



నేను ఓ ప్రముఖ కంపెనీ వైర్‌లైస్ నెట్ వాడుతున్నా. 300ఎంబీపీఎస్ స్పీడ్‌తో నెట్ తీసుకున్నాను. కంప్యూటర్‌ట్, టీవీ, సెల్‌ఫోన్‌లకు ఉపయోగించుకుంటున్నాం. ఆన్‌లైన్ సేవలు, టీవీ షోలు, సినిమాలు, ఉన్నత విద్యకు అవసరమైన సమాచారం, పరిశోధనల సమాచార సేకరణకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మా ఇంట్లో ఉన్న నలుగురికి అన్‌లిమిటెడ్ నెట్ సేవలు అందుతున్నాయి. ప్రపంచమంతా ఇంట్లోనే ఉన్నట్టుంది.

– ప్రదీప్ కుమార్, ఎంటెక్ విద్యార్థి

ఎంతో ఉపయోగకరం



నేను బీఎస్ఎన్ఎల్ నెట్ తీసుకున్నా. మా పిల్లలకు వేసవి సెలవులు కావడంతో సంగీతం క్లాసులు, అకడమిక్ తరగతులు ఆన్‌లైన్‌లో కోచింగ్ ఇప్పిస్తున్నా. ఇందుకోసం 100 ఎంబీపీఎస్ వేగంతో నెట్ తీసుకున్నా. నెలకు రూ. 899 చెల్లిస్తున్నా. ఇది ఇంటిల్లిపాదీ సెల్‌ఫోన్‌లకు సైతం వాడుకుంటున్నాం. అన్‌లిమిటెడ్ నెట్ కాబట్టి పిల్లలకు ఆటవిడుపుగా జనరల్ నాలెడ్జ్ యాప్స్‌తో పాటు చిన్న చిన్న ఆటలు సైతం ఆన్‌లైన్‌ను వినియోగించుకుంటున్నాం

– ప్రభావతి, కేంద్రప్రభుత్వ ఉద్యోగి

నోటీస్ బోర్డు

- భజన భక్త మండలి ఆధ్వర్యంలో ఉదయం 4.45 గంటలకు శ్రీగోవిందరాజస్వామి మాడ వీధుల్లో నగర సంకీర్తన.
- జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏపీపీఎస్సీ గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్ పరీక్షలు.
- బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ప్రెస్‌మీట్.
- శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పుష్పయాగం.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు నృత్య పోటీలు.
- కంచికామకోటి పీఠం ఉత్తరాధికారిగా నియమితులైన సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారికి సాయంత్రం 6.30 గంటలకు కపిలతీర్థం నంది సర్కిల్‌లో మంగళ నీరాజనాలతో స్వాగతం.
- యూత్ హాస్టల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్పీ

తిరుమల : నగరవాసుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శుక్రవారం ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని పూర్ణకుంభం సర్కిల్ వద్ద అవుట్ పోస్ట్ పక్కన చలివేంద్రం ప్రారంభించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



సూచనలిస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా/ తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలని మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య ఆదేశించారు. ఈనెల 6 నుంచి జాతర ప్రారంభంకానున్న నేపథ్యంలో శుక్రవారం ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ గంగమ్మ జాతరకు ప్రాచీన చరిత్ర ఉందని, గతంలో ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు దర్శించుకుని సారె సమర్పించాలని వెల్లడించారు. కమిషనర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏ.జయకుమార్, కార్పొరేషన్, తుడా ఎస్ఈలు శ్యామ్‌సుందర్ కృష్ణారెడ్డి, ఎంఈ తులసీ కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ , డీఈ రాజు, రెవెన్యూ అధికారి సేతుమాధవ్ పాల్గొన్నారు.

కపిలతీర్థంలో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ చేపట్టిన బలగాలు

తిరుపతి కల్చరల్/తిరుపతి క్రైమ్ : పహల్‌గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా కపిలతీర్థం ఆలయంలో శుక్రవారం ఆక్టోపస్, పోలీసు, టీటీడీ విజిలెన్స్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది సమష్టిగా మాక్ డ్రిల్ నిర్వహించారు. బలగాలు మూడు గ్రూపులుగా వ్యూహాత్మకంగా సమన్వయంతో ఆలయంలోకి ప్రవేశించి భక్తులను ఎలా రక్షించాలి అనే అంశాలను ప్రదర్శించారు. సుమారు రెండు గంటల పాటు మాక్ డ్రిల్ కొనసాగింది. 40 మంది ఆక్టోపస్ కమాండోలు, 10 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, 15 మంది పోలీసులు, 13 మంది ఏఆర్ సిబ్బంది, 12 మంది మెడికల్ సిబ్బంది, ఫైర్, ఆర్మీ, బాంబ్ స్క్వాడ్ ,ఎలక్ట్రికల్, వాటర్, గ్యాస్ శాఖల సిబ్బంది మాక్ డ్రిల్‌లో భాగస్వాములయ్యారు. ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ సి.రాజారెడ్డి, డీఎస్పీ మధుసూదన్‌రావు పర్యవేక్షించారు.

ఘనంగా శంకర జయంతి



శోభాయాత్రలో భక్తులు

తిరుపతి కల్చరల్ : శృంగేరి మఠం ఆధ్వర్యంలో ఆది శంకరాచార్యుల జయంతి నిర్వహించారు. శుక్రవారం ఈ మేరకు శోభాయాత్ర చేపట్టారు. శంకరమఠం నుంచి శ్రీకోదండరామస్వామి ఆలయ మాడ వీధుల్లో శంకరాచార్యుల చిత్రపటాలతో యాత్ర సాగించారు. మఠం ధర్మాధికారి రాళ్లపల్లి రామమూర్తి, గంద్ర కోట లక్ష్మీ మనోహర్,నడింపల్లి కృష్ణ, పూర్ణచంద్ర, సురభి మురళి పాల్గొన్నారు.

చిగోరాలో..

ఆది శంకరాచార్యులు, రామానుజాచార్యుల జయంతిని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో నిర్వహించారు. సేవా కేంద్రం అధినేత చిత్రపు హనుమంతరావు, బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సిబ్బంది హారిక, బి.లీలావతి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

తేజోకుమార్‌కు బిరుదు ప్రదానం



విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న వీసీ

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో ఐదు రోజుల పాటు నిర్వహించిన శంకర జయంతి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రస్థానత్రయ భాష్య పారాయణం, శంకరుల పూజాభిషేకం జరిపించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగద్గురు ఆది శంకరుల పాదయాత్ర, ఆయన రచించిన స్తోత్రాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు తిరుమల క్షేత్రం ప్రాధాన్యతను తెలిపారు. అనంతరం గోవింద భగవత్ పాదాచార్య వాక్యార్థంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి తేజ్ కుమార్‌కు ×వాక్యార్థ చక్రవర్తి బిరుదు ప్రదానం చేశారు. అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా, రాధా గోవింద త్రిపాఠి, కె.గణపతి భట్, కేఎస్ సతీష్, నాగరాజ్‌భట్ మనోజ్‌షిండే పాల్గొన్నారు.

4న స్థానికులకు శ్రీవారి దర్శన టోకెన్లు

తిరుమల : మహతి ఆడిటోరియంలో ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికుల కోటా కింద ఆదివారం తిరుమల శ్రీవారి దర్శన టోకెన్లను టీటీడీ పంపిణీ చేయనుంది. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన భక్తులు ఆధార్ కార్డులు చూపించి టోకెన్లు పొందవచ్చు. ఈ క్రమంలోనే తిరుమల స్థానికులకు బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో దర్శన టోకెన్లు పంపిణీ చేయనున్నారు.

ఈ-పాలగుట్టపల్లెలో పీఎండీఎస్ కిట్లు

పాకాల : మండలంలోని ఈ-పాలగుట్టపల్లెలో పీఎండీఎస్ కిట్‌లను శుక్రవారం తయారు చేశారు. డీపీఎం షణ్ముగం మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా తమ పొలంలో పీఎండీఎస్ కిట్లు వేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారానే ఆరోగ్యకర ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఓలు పట్టాభిరామిరెడ్డి, పుష్పావతి, ట్రైనర్ శ్రీదేవి, సీఆర్‌పీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

15 నుంచి ఏఐవైఎఫ్ మహాసభలు

తిరుపతి కల్చరల్ : నగరంలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి తెలిపారు. శుక్రవారం బైరాగిపట్టెడలోని సంఘం కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభలకు దేశంలోని 29 రాష్ట్రాల నుంచి యువజన సమాఖ్య ప్రతినిధులు రానున్నట్లు వెల్లడించారు. నేతలు ఎం.రామకృష్ణ, ఉదయ్‌కుమార్, సీహెచ్ ప్రవీణ్‌కుమార్, విక్రమ్, ఓం రాజ్, చంద్రనాయక్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

తిరుపతి అర్బన్ : పహల్‌గామ్ ఘటన నేపథ్యంలో శుక్రవారం తిరుపతి రైల్వేస్టేషన్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో రైల్వే పోలీస్, భద్రతా దళాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ఆర్‌పీఎఫ్ సీఐ సందీప్, రైల్వే సీఐ ఆశీర్వాదం నేతృత్వంలో ప్రయాణికుల లగేజీని సైతం పరిశీలించారు. ప్రయాణికులకు అత్యవసర సమయంలో సాయం అందించే రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139పై అవగాహన కల్పించారు.

కిశోర బాలికలకు శిక్షణ



మాట్లాడుతున్న పీడీ వసంతబాయి

చంద్రగిరి : నారావారిపల్లె లో శుక్రవారం కిశోర బాలికలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐసీడీఎస్ పీ డీ వసంత బాయి మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల ఆడ పిల్లల అభ్యున్నతి కోసం కిశోర వికాసం పేరిట వేసవి శిక్షణ శిబిరాలు చేపట్టినట్లు వెల్లడించారు. సీడీపీఓ ప్రదీప, సర్పంచ్ లక్ష్మి, సూపర్‌వైజర్లు నాగమణి, శ్రీలక్ష్మి, ప్రతిమ, యామిని పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపునకు యత్నం

తిరుపతి మంగళం : కరకంబాడి మార్గంలోని బొంతాలమ్మ ఆలయం వద్ద పండ్ల దుకాణాలను తొలగించేందుకు శుక్రవారం కార్పొరేషన్ అధికారులు యత్నించారు. ఏఐటీయూ నేతలు అక్కడకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కూటమి నేతల కారణంగానే అధికారులు తమ పొట్టకొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్లేసి గెలిపించినందుకు తగిన బుద్ధి చెబుతున్నారని మండిపడ్డారు. పండ్ల వ్యాపారులు పడేసే వ్యర్థాల కోసం జింకలు, చిరుతలు వస్తున్నాయని, ఆ మేరకు ఫారెస్ట్ అధికారుల ఫిర్యాదు చేయడంతో షాపులను తొలగించాలని కమిషనర్ ఆదేశించారని నగరపాలక సంస్థ సిబ్బంది వెల్లడించారు. అయితే ఉన్నతాధికులతో తాము మాట్లాడతామని, తర్వాతనే ఎలాంటి చర్యలైనా తీసుకోవాలని ఏఐటీయూసీ నేతలు కేతారి రాధాకృష్ణ, ఎన్‌డీరవి సూచించారు. దీంతో అధికారులు వెళ్లిపోయారు.